జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



గురువారం | 5-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 583 పేజీలు: 4 వెల : రూ.7







# గోవిందుని చెరలో.. భగీరథిపురం

* వంశధారలో 15 మీటర్ల లోతున తవ్వేస్తున్న ఇసుక * దిశ మారనున్న వంశధార ప్రవాహం * 300 ఎకరాల సాగుభూమి స్వాహా * గజగజ వణుకుతున్న నదీ తీర ప్రాంత గ్రామాలు * గొట్టా బ్యారేజీకి పొంచి ఉన్న ముప్పు * అధికార పార్టీ నేతల అండదండలతో తవ్వకాలు * చోద్యం చూస్తున్న అధికారులు

**కొత్తూరు,జనవరి 4 (వార్త):** అది ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో, కళకళలాడే నదీ తీరంతో అలరారిన గ్రామం. కానీ నేడు ఇసుక మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిలలాడుతోంది. కొందరు స్వార్థ రాజకీయ నాయకుల ధనదాహానికి ప్రకృతి ప్రసాదించిన వనరులు బలైపోతున్నాయి. భగీరథిపురం గ్రామ పరిసరాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు ఇప్పుడు ఒక పర్యావరణ విలయానికి దారితీస్తున్నాయి. ఇదేంటి అని అడిగే నాథుడే లేడు. అటు వైపు చూసే అధికారి కూడా కానరావడం లేదు. ఈ ఇసుక అక్రమార్కుల ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయంటే.. నిబంధనలకు విరుద్ధంగా ఏకంగా 15 నుండి 20 మీటర్ల లోతు వరకు ఇసుకను తోడేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు గొట్టా బ్యారేజ్‌కు కేవలం 2.5 కిలోమీటర్ల దిగువనే జరుగుతుండటం గమనార్హం. ఇది బ్యారేజ్ నిర్మాణ స్థిరత్వాన్ని దెబ్బతీసే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారీ లోతులో తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జల మట్టం పడిపోయి, సుమారు 500 గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందకుండా పోయే ప్రమాదం ఉంది. ప్రతిరోజూ నదిలోకి పదుల సంఖ్యలో 8 చక్రాల లారీలు వస్తున్నాయి. ఒక్కోటి 20 టన్నుల కంటే ఎక్కువ బరువుతో ఇసుకను తరలిస్తున్నాయి. ఈ భారాన్ని భరించలేక మహాలక్ష్మీపురం కాలనీ వంతెన ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. గాలిలోకి లేస్తున్న దుమ్ము కారణంగా భగీరథిపురం గ్రామస్తులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడవాలంటేనే ప్రాణభయంతో వణికిపోతున్నారు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నుంచి ఎస్పీ వరకు, రాజకీయ నాయకుల నుండి రెవెన్యూ అధికారుల వరకు అందరికీ మొరపెట్టుకున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం మారలేదు. 'రెవెన్యూ శాఖ నుండి మాకు కనీస మద్దతు లభించడం లేదు" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల అలసత్వం అక్రమార్కులకు వరంగా మారింది. ఇది కేవలం ఒక ఊరి ప్రాంత సమస్య కాదు.. మనందరి భవిష్యత్తు సమస్య" అంటూ భగీరథిపురం రైతులు గళమెత్తారు. రాష్ట్ర, కేంద్ర పర్యావరణ శాఖలు వెంటనే స్పందించి ఈ ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ పోరాటాన్ని ఉధృతం చేయాలని ఆ చుట్టుపక్కల గ్రామస్థులు నిర్ణయించుకున్నారు.





# పోలీసుల ఐక్యత, సమన్వయానికి.. క్రీడలు ప్రతీక

* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * వార్షిక జిల్లా పోలీసు స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025 ప్రారంభం * ఉత్సాహంగా పాల్గొన్న పోలీసు సిబ్బంది

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 4 (వార్త):** పోలీసు ఉద్యోగులలో ఐకమత్యం, సమన్వయం, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర్ రెడ్డి అన్నారు. తండేవలసలో గల పోలీస్ శిక్షణ కేంద్రం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వార్షిక జిల్లా పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 ప్రారంభ వేడుకలకు జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై, క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ముందుగా జిల్లా ఎస్పీ.. పోలీసు క్రీడాజ్యోతిని వెలిగించి, గాలిలోకి శాంతికి చిహ్నంగా పావురాలు, బెలూన్లు ఎగురవేసి క్రీడాకారులలో ఉత్సాహాన్ని నింపారు. క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ ఘనంగా నిర్వహించారు. ఈ వార్షిక క్రీడా పోటీలు మూడు రోజుల పాటు నిర్వహించనుండగా, శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖకు చెందిన శ్రీకాకుళం, టెక్కలి, కాశీబుగ్గ సబ్ డివిజన్లు, పోలీసు కార్యాలయం, ఆర్మ్డ్ రిజర్వ్, ఎస్‌టిఎఫ్, హోంగార్డ్స్ విభాగాలకు చెందిన మొత్తం ఏడు జట్లు వివిధ క్రీడాంశాల్లో పోటీపడి తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించనున్నాయి. ప్రారంభ వేడుకల్లో పురుషుల 400 మీటర్ల పరుగు, పురుషులు,మహిళల 100 మీటర్ల పరుగు,వంటి పోటీలను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధులు సాధారణంగా ఒత్తిడితో కూడుకున్నవన్నారు. అలాంటి పరిస్థితుల్లో క్రీడలు మనకు శారీరక ఉత్సాహంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తాయిని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ ద్వారా జట్టు సమన్వయం, పరస్పర అవగాహన, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయిన్నారు. ఇవే లక్షణాలు పోలీసు విధుల్లో కూడా అత్యంత అవసరం అని అన్నారు. ప్రతి సబ్ డివిజన్,పోలీసు కార్యాలయంకు చెందిన అధికారులు, సిబ్బంది, ఎస్‌టిఎఫ్, హోంగార్డులు అందరూ ఆసక్తితో పాల్గొని, ఈ క్రీడా పోటీలను స్ఫూర్తిదాయకంగా, విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ వార్షిక క్రీడా పోటీల ప్రారంభ వేడుకల్లో అదనపు ఎస్పీలు కె.వి. రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద్, లక్ష్మణరావు, షేక్ సహబజ్ అహ్మద్, శేషాద్రి, గోవిందరావు, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.





## ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

వార్షిక పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 పోటీలు తండేవలస పోలీసు శిక్షణ మైదానంలో ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. ఈ క్రీడా పోటీలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. కబడ్డీ పోటీల్లో ఆర్మ్డ్ రిజర్వ్, జిల్లా పోలీసు కార్యాలయం, ఎస్‌టిఎఫ్, హోంగార్డ్స్ జట్లు తలపడ్డాయి. వాలీబాల్ పోటీల్లో కాశీబుగ్గ సబ్ డివిజన్, హోంగార్డ్స్, జిల్లా పోలీసు కార్యాలయం, శ్రీకాకుళం సబ్ డివిజన్, టెక్కలి సబ్ డివిజన్, ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం జట్లు పరస్పరం పోటీపడ్డాయి. క్రికెట్ పోటీల్లో జిల్లా పోలీసు కార్యాలయం జట్టు, హోంగార్డ్స్ జట్టు, టెక్కలి సబ్ డివిజన్--శ్రీకాకుళం సబ్ డివిజన్ జట్లు తలపడ్డాయి. వ్యక్తిగత క్రీడలైన షాట్‌పుట్, జావెలిన్ త్రో వంటి అథ్లెటిక్స్ పోటీల్లో మహిళ పోలీసు సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు.



# మమ్మల్ని ఆపేదెవడ్రా!

* మా రూటే సెపరేటు * జిల్లా మంత్రి, ఎమ్మెల్యే మా వారే * ఎవరు ఏం ఫిర్యాదు చేసినా మాకు ఏం కాదు * ఎక్కడ నుంచి ధాన్యం కొనుగోలు చేసినా అడిగేవారు ఎవరు? * ఇది ఎల్ఎన్‌పేట రైస్ మిల్లర్స్‌లో కొందరు తీరు



**ఎల్ఎన్‌పేట, ఫిబ్రవరి4(వార్త):** మమ్మల్ని అడ్డుకునేదెవరు... మాకు నచ్చినట్లు కొనుగోలు చేస్తాం... మా రూటే సెఫరేటు.. మా రైస్ మిల్లర్స్‌పై ఎవరు ఫిర్యాదు చేసుకున్నా మా జిల్లా మంత్రి మావారే, మా ఎమ్మెల్యే మావారే.. వాళ్లే చూసుకుంటారు. మా రైస్ మిల్లర్స్ అంతా మేము ఒక సిండికేట్‌గా ఉన్నాం... ఎవరేం చేసుకుంటారో చేసుకోండి.. మాకు కూటమి ప్రభుత్వం అండగా ఉంది. అంతా మా ఇష్టం... మాకు లాభం ఉంటేనే మిల్లులను నడుపుతాం లేకపోతే అన్నీ మూసివేస్తాం. రాష్ట్ర సీఎం మాకు చెప్పినా మేము చెప్పేది ఒకటే... అంతా మాఇష్టంగా ఉంటేనా మేము మిల్లులను కొనసాగిస్తాం లేకుంటే అందరం మూసివేస్తాం.. అని ఎల్ఎన్‌పేట మండలంలోని కొందరు రైస్ మిల్లర్స్ యజమానుల తీరిది. మంగళవారం ఎల్ఎన్‌పేట జంక్షన్ పరిధిలో పద్మనాభం మిల్లు వద్ద అనుమతులు లేకుండా ఒరిస్సా రాష్ట్రం నుంచి వచ్చిన ధాన్యం లారీ ఆగి ఉంది. సమాచారం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకొని ధాన్యం ఎక్కడ నుంచి వచ్చాయి. ఎక్కడకు వెళుతున్నాయి అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై పూర్తివిచారణ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక రెవెన్యూ అధికారులు తెలిపారు.. దీంతో కొందరు రైస్ మిల్లర్లకు నచ్చలేదు. దీంతో కొందరు సిండికేట్ రైస్ మిల్లర్లు ఏకమయ్యారు. తమపై కేసు లేకుండా చూసుకునేందుకు తమతమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వారంతా తమకేం కాదని, తమ వెనుక పెద్ద పెద్ద హస్తాలు ఉన్నాయని చర్చించుకున్నట్టు తెలిసింది.

(అసలు వీరి ధైర్యం ఏంటో, వీరి వెనుక ఎవరు ఉన్నారో.. ఎందుకు ఇలా బరి తెగిస్తున్నారో, ఒడిశా నుంచి బియ్యాన్ని ఎక్కడ నుంచి తెస్తున్నారు, పీడీఎఫ్ బియ్యం ఎక్కడికి వీరు తరలిస్తున్నారన్న దానిపై 'జాతీయ వార్త'లో సమగ్ర కథనం త్వరలో..)

## మార్చి 15లోగా ఉపాధి బిల్లులు అప్‌లోడ్ చేయాలి

* జిల్లాలో 13,839 పాత పనులను వెంటనే పూర్తి చేయండి
* అధికారుల సమీక్షలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

## పొందూరు ఖద్దరుకు మహర్దశ

* రూ.100 కోట్లతో క్లస్టర్ యూనిట్ * స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్ * వేలాది మందికి ఉపాధి లక్ష్యంగా భారీ ప్రాజెక్టు

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## తమ్మయ్యపేట పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంఈఓ

**-విద్యార్థుల నైపుణ్యాల పరిశీలన**

**జలుమూరు, ఫిబ్రవరి 4(వార్త):** తమ్మయ్యపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 ఎంవిఆర్ఎస్ ప్రసాదరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, వారి విద్యా స్థాయిని పరీక్షించారు. బోధన విధానాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్న ఆయన, విద్యార్థుల్లో చదవడం, రాయడం నైపుణ్యాలు మెరుగుపడేందుకు ప్రతి రోజూ డిక్టేషన్, రీడింగ్ ప్రక్రియలను తప్పనిసరిగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. బోధనలో మెలకువలు పాటిస్తూ, విద్యార్థుల అవగాహన పెరిగేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడాలంటే ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది ఆయన సూచనలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.



## వీఆర్వోల సంఘం నూతన అధ్యక్షునిగా గజపతి



**మందస, ఫిబ్రవరి 4(వార్త):** మందస మండల గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) నూతన అధ్యక్షునిగా 'పాండవ గజపతి' ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సమావేశం బుధవారం మందస తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ వీఆర్వో ఉషారాణి ఆధ్వర్యంలో జరిగింది. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షునిగా పాండవ గజపతి, ఉపాధ్యక్షుడిగా ఎం.నాగేశ్వరరావు, సెక్రటరీగా ఎం.హేమ రాజు, జిల్లా కార్యదర్శిగా ఎం.క్రాంతి, డివిజనల్ కార్యదర్శిగా జి.సురేష్, ట్రెజరర్ గా గౌరీ, కావ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు తహసీల్దార్ శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలసి, నూతన కార్యవర్గ వివరాలను అందజేశారు. నూతన కార్యవర్గాన్ని ఆయన అభినందించారు.

## పీఓను కలిసిన ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు



**మందస, ఫిబ్రవరి 4(వార్త):** మందస మండల పర్యటనకు వచ్చిన ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్‌ను బుధవారం ఆదివాసీ వికాస పరిషత్ అధ్యక్షుడు సవర జగన్ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. ఈ సందర్భంగా జగన్ పీఓతో మాట్లాడుతూ బ్రిడ్జిల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని చెప్పారు. దీంతో అధికారులను మందలించి, నాణ్యతలో ఎటువంటి అవకతవకలు జరగకూడదని, మార్చి నెల కల్లా రెండూ బ్రిడ్జి లు పూర్తి చేయాలని ఆదేశించారు. పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

## కేవీకేలో ఆరున కిసాన్ మేళా

**ఆమదాలవలస, ఫిబ్రవరి 4(వార్త):** నైరలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 6న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'వ్యవసాయా ధారిత వ్యాపారాభివృద్ధి' అంశంపై కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వ విద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. మేళాలో భాగంగా ఏర్పాటు చేసే వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు, క్షేత్ర సందర్శన వంటి కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా తదితరులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని రైతులు, మహిళా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఔత్సాహిక యువత ఈ మేళాకు పెద్ద ఎత్తున హాజరై, సాగులో వ్యాపార మెళకువలను తెలుసుకోవాలని కోరారు.

## ఆదిత్యుని హుండీల లెక్కింపు



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి వారి దేవాలయంలోని రెండు హుండీలను బుధవారం లెక్కకట్టగా.. నోట్లు, చిల్లర ద్వారా రూ.33,49,379లు ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి వారి దేవస్థానం ఈవో గురునాథరావు, ఉమారుద్ర కోటేశ్వరస్వామి దేవాలయం ఈవో సుకన్య, ఆలయ, సేవాదళ సిబ్బంది పాల్గొన్నారని ఆదిత్యుడి ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## జెమ్స్, కిమ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 4(వార్త):** వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా జెమ్స్, కిమ్స్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ట్స్ కాలేజీ రోడ్‌లో ర్యాలీ జరిపారు. దీనికి ఎమ్మెల్యే గొండు శంకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఆర్ట్స్ కాలేజీ నుంచి డే అండ్ నైట్ జంక్షన్ వరకు సాగి, అక్కడ మానవహారం నిర్వహించారు. క్యాన్సర్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సలహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జెమ్స్ డీన్ లక్ష్మీలలిత, వైద్య బృందం లలితకుమారి, హేమంత్, రవి, సంతోష్, రాకేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.




# పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

**-ఐటీడీఏ సీతంపేట పీఓ పవార్ స్వప్నిల్**

**-పలు ఇంజనీరింగ్ పనుల పరిశీలన**

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ సూచించారు. బుధవారం ఆయన మందస మండలంలో పర్యటించారు. కిల్లోయి బాలికల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మరుగుదొడ్లను పరిశీలించి మరింత పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ముస్తాబు కార్యక్రమం పక్కాగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. బుడంబో బాలికల ఆశ్రమ పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలఅన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంతో పాటు రుచికరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం బుడంబో పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం మందస - చీపి బీటీ రోడ్డు నుంచి బుడంబో బీటీ రోడ్డు మధ్యలో చేపడుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. దాలసరి బీటీ రోడ్డు నుంచి బుడంబో బీటీ రోడ్డు మధ్యలో చేపడుతున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ బ్రిడ్జి పనుల్లో నాణ్యత లోపించకూడదన్నారు. పనులను వేగవంతం చేసి, సకాలంలో పూర్తికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ కృష్ణకుమార్, ఏఈ ఇబ్రహీం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.





## కిష్టప్పపేట -అంపోలుకు నూతన రహదారి

**-చింతబంద మీదుగా లింగం చెరువు వరకు మట్టి రోడ్డు నిర్మాణం**

**-నాలుగు కిలోమీటర్లు కాలినడకన పర్యటించి పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్**

**-రెండు వాహనాలు ఎదురెదురుగా ప్రయాణించే వెడల్పైన రోడ్డు ఏర్పాటు**

**- తీరనున్నరైతుల కష్టాలు -వ్యవసాయ భూములకు వెళ్లేందుకు రైతులకు మరింత సులభం**

**-హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు, ఆరు గ్రామాల వాసులు**




**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** రైతులు పొలాలకు వెళ్లేందుకు కిష్టప్ప పేట-అంపోలు గ్రామాలను కలుపుతూ చింతబంద మీదుగా లింగం చెరువు వరకు నాలుగు కిలోమీటర్ల మేర 20 అడుగుల వెడల్పుతో సుందర మట్టి రోడ్డును ఇటీవల నిర్మించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. బుధవారం ఎమ్మెల్యే శంకర్ స్వయంగా ఆ రహదారిలో కాలినడకన పర్యటించారు. చర్యలు చేపట్టనున్నారు. రహదారి ద్వారా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, పంట చేను కల్లాలకు తీసుకొచ్చేందుకు చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగ ఆ రెండు గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలకు పూర్వ వైభవం తెస్తా : విఠల్



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞాన నిలయా లుగా తీర్చిదిద్ది, వాటికి పూర్వవైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు పీరుకట్ల విఠల్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026-27కు గాను రూ.6 కోట్ల బడ్జెట్‌కు ఆమో దించి, తదుపరి పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఆమోదానికి పంపామని తెలిపారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ, గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భవన మరమ్మతులు చేపట్టి, ఆకర్షణీయమైన రంగులతో గ్రంథాలయ రూపురేఖలు మారుస్తామన్నారు. చెదలు పట్టిన తలుపులు, పాత ఫర్నీచర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు, పాఠకుల సౌకర్యార్థం ఆధునిక టాయిలెట్లు, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నిధుల కొరతతో పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు, పెన్షన్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంచుతామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని 44 శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ఆయన కొనియాడారు. సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శంకర్ రావు, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్‌రావు, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

## జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేయడమే లక్ష్యం

**-భావనపాడులో వైసీపీ**

**జెండా ఆవిష్కరణలో తిలక్**

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 4(వార్త):** ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. బుధవారం ఆయన భావనపాడులో వైసీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందన్నారు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న వైసీపీ నాయకులపై దాడి చేసి అక్రమంగా కేసులు బనాయిస్తున్నారన్నారు. ఎన్ని దాడులు చేసినా అక్రమ కేసులు పెట్టిన ప్రజల తరఫున నిరంతరం వైసీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజలందరూ మళ్లీ జగన్‌ని ముఖ్యమంత్రి చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన మానకపోతే ప్రజలే తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. పార్టీని గ్రామాల్లో మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పనిచేయాలని కోరారు. అనంతరం వృద్ధులకు, వితంతువులకు, మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పాల వసంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బి.రాజ్యలక్ష్మి, వైసీపీ నాయకులు మార్పు నాగభూషణరావు, జీరు బాబూరావు, చిన్ని జోగారావు, ధర్మారావు, కారాడ చిన్నబాబు, బత్తిని పకీరు, బి.వాసుదేవరావు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



## పురుషోత్తపురంలో మట్టి ఆరోగ్య కార్డులు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4(వార్త):** పురుషోత్తమ పురం, పీఎంశ్రీ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ మట్టి ఆరోగ్య కార్డు పథకం కింద ఎంపికైందని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు. విద్యార్థులకు పొలంలో మట్టి నమూనా ఎలా సేకరించాలి, సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో ఎలా విశ్లేషిస్తారు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి మట్టి పరీక్షా ప్రయోగశాల ఏడీఏ కె. కృష్ణారావు, వ్యవసాయ అధికారి పద్మనాభం, రవికుమార్ హాజరై మట్టి ప్రాముఖ్యత, సరైన నమూనా సేకరణ విధానం, పంటలకు అవసరమైన పోషకాలు, మట్టి పరీక్షల వల్ల కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు సవివరంగా వివరించారు. ప్రిన్సిపాల్ వైకుంఠరావు విద్యార్థులను ప్రోత్సహిస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో మట్టి పరీక్షలు చేయడం ద్వారా పంట దిగుబడులు పెంచుకోవచ్చని తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మట్టిరక్షణ, సుస్థిర వ్యవసాయం పట్ల ఆసక్తి పెరిగి, భవిష్యత్తులో రైతులకు ఉపయోగపడే జ్ఞానం అందించబడిందని నిర్వాహకులు తెలిపారు.

## వైసీపీని ప్రజలు క్షమించరు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4(వార్త):** తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వ హయాంలో శ్రీవారి లడ్డు తయారీలో నెయ్యకు బదులు రసాయనాలతో కూడిన సింథటిక్ కలిగిన నెయ్యి తయారు చేసి కల్తీ లడ్డూలను తయారు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వైసీపీ నాయకులు వ్యవహరించిన తీరును జనసేన పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తిప్పన దుర్యోధన రెడ్డి ఖండించారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. దేశంలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన టీటీడీ స్వామివారి లడ్డుప్రసాదం కల్తీ చేసి, అక్రమ సంపాదన లక్ష్యంగా, హిందువుల పవిత్రతను దెబ్బతీసేవిధంగా రసాయనంతో కూడిన నెయ్యి సరఫరా చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సిట్ దర్యాప్తులో లడ్డు తయారీలో పూర్తిగా నెయ్యిని వినియోగించలేదని కుండబద్దలు కొట్టినట్టు చెబుతున్నప్పటికీ, వైసీపీ శ్రేణులు దీన్ని తప్పుదోవ పట్టించేందుకు రాష్ట్రంలో అనేక అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ, కుల, మత పరమైన విద్వేషాలను కలిగిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పేదలకు చేసిన పాపాలకు ఫలితంగా 151 సీట్ల నుండి 11 సీట్లకు దిగజారి పోయారన్నారు. రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న దిగజారుడు రాజకీయాలను ప్రజలంతా గమనిస్తున్నారని, దేవుడు క్షమించినా ప్రజలు క్షమించరని రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు.

## క్రైస్తవులపై దాడులను అరికట్టాలి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి4 (వార్త):** శ్రీకాకుళం ఆంధ్ర బాప్టిస్ట్ చర్చిలో జిల్లాలోని బాప్టిస్ట్ చర్చి దైవ సేవకులందరూ రెవరెండ్. డా.కొత్తపల్లి. అబ్రహం అయ్య ఆధ్వర్యంలో సమా వేశం ఏర్పాటు చేశారు. క్రైస్తవుల మీద, దైవ సేవకులు మీద, చర్చి మీద జరుగుతున్న దాడులు, వ్యతిరేక పరిస్థితి, ఏవిధముగా ఎదుర్కోవాలో చర్చించారు.పెద్దలు సూచనలు, సలహాలు తెలిపారు. వైస్సార్సీపీ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి డా. ప్రత్తి అన్వేష్ పాల్గొని అమూల్యమైన సలహాలు సూచనలు చేశారు. భవిష్యత్‌లో జిల్లా లోని క్రైస్తవ దైవ సేవకులు సంఘాలు ఐక్యం కలిగి ముందుకు వెళ్లి, సంఘాలు, దైవ సేవకుల క్షేమం కోసము భవిష్యత్తు కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

## కొత్తూరులో విద్యాంజలి 2.0పై శిక్షణ

**కొత్తూరు, జనవరి 4(వార్త):** కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యాంజలి 2.0 శిక్షణా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తూరు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ ఛైర్మన్లు, సభ్యులు హాజరై శిక్షణ పొందారు. ఈ సందర్భంగా కొత్తూరు మండల విద్యాశాఖ అధికారులు సిహెచ్. గోవిందరావు, శ్రీనివాసరావులు మాట్లాడుతూ, నేటి రోజుల్లో పాఠశాలల సమగ్ర అభివృద్ధికి సమాజ భాగస్వామ్యం ఎంతో కీలకమని తెలిపారు. ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, గ్రామస్థులు విద్యాభివృద్ధిలో భాగస్వాములవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రసాదరావు, సురేష్‌లు రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించి విద్యాంజలి 2.0 కార్యక్రమ లక్ష్యాలు, అమలు విధానం, పాఠశాలల అభివృద్ధిలో ఎస్ఎంసీ పాత్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు మండలంలోని 36 పాఠశాలలకు చెందిన హెడ్‌మాస్టర్లు, ఎస్ఎంసీ ఛైర్మన్లు, సభ్యులు పాల్గొని శిక్షణను సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని నిర్వాహకులు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శక్తి యాప్ వినియోగంపై అవగాహన

**పోలాకి, ఫిబ్రవరి 4(వార్త):** సెల్ ఫోన్ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని టెక్కలి డివిజన్ శక్తి టీం హెచ్సీ ఎం. గిరిధర్, మహిళ పీసీ యమున పిలుపునిచ్చారు. బుధవారం పోలాకి మండలం సుసరాం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు ఈ విషయాన్ని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నేటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఫోన్‌లో రీల్స్ చూడటానికి ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని, అదే స్థాయిలో శక్తి యాప్‌పై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, ప్రమాద సమయాల్లో శక్తి యాప్ మహిళలకు తక్షణ సహాయాన్ని అందిస్తుందని వివరించారు. మహిళల భద్రత దృష్ట్యా శక్తి యాప్ వినియోగం ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ ఈ యాప్‌ను తమ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# పలాసను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

### -జీవితం ప్రజాసేవకే అంకితం

### -ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** పలాసను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుధవారం ఆమె పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో లక్షలాది రూపాయల అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 4వ వార్డు రాజాం కాలనీలో ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా మంజూరైన నూతన సామాజిక భవనాన్ని ఆమె ప్రారంభించారు. 13వ వార్డులో రూ. 4 లక్షలు, 5వ వార్డులో రూ. 15 లక్షల విలువైన నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 17వ వార్డులో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే శిరీషకు స్థానిక మహిళలు హారతులు, నీరాజనాలతో బ్రహ్మరథం పట్టారు. “తండ్రి శివాజీ రాజకీయ వారసత్వాన్ని మీరు నిలబెట్టాలని, ఆయన లాగే మీరు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేయాలని, రాబోయే ఎన్నికల్లో మా ఓటు మీకే” అని వారు ముక్తకంఠంతో తమ మద్దతును ప్రకటించారు. ప్రజల అభిమానానికి చలించిపోయిన ఎమ్మెల్యే శిరీష మీ నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని ఆమె పేర్కొన్నారు. ఆమె వెంట పలాస మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.

## అమరావతికి తరలిన నీటి సంఘం ప్రతినిధులు



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4 (వార్త):** మన నీరు మన భవిష్యత్ కార్యక్రమంలో భాగం గా సాగునీటి వినియోగం దారుల పాత్రపై నీటి వినియోగం దారుల సంఘం అధ్యక్షులతో అమరావతి లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో సమావేశం సందర్భంగాఇచ్ఛాపురం ఇరిగేషన్ ఎ ఇ మధుసూదన పాణి గ్రహి ఆధ్వర్యంలో నీటి వినియోగం దారుల సంఘం అధ్యక్షులు ఇచ్ఛాపురం నుండి అమరావతి కి తరలి వెళ్లారు. నీటి వినియోగదారులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ప్రత్యేక బస్సు లో వెళ్ళారు.

## త్రుటిలో తప్పిన భారీ లారీ ప్రమాదం




**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** కంబరిగం జంక్షన్ వద్ద పాత జాతీయ రోడ్డుపై పైపుల లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో రహదారిపై ఇతర వాహనాలు లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. లారీ సబ్ రోడ్డు వైపు ఒరిగిపోవడంతో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. భారీ లోడు కారణంగానే ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. స్థానికులు ప్రమాద తీవ్రతను చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. హైవేపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై కాశీబుగ్గ పోలీసులు విచారణ చేపట్టారు.

## వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండాలి



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 4(వార్త):** సీతంపేట ఐటిడిఏ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వసతి గృహాలలో గదులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సీతంపేట ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ అన్నారు. బుధవారం నాడు ఆయన మెళియాపుట్టి మండలంలో గల భరణికోట ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థుల విద్యా ప్రగతి పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థుల సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్శనలో పిఓతో పాటు ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది తదితరులున్నారు.

## పంజా స్ట్రీట్ స్కూల్‌లో వరల్డ్ క్యాన్సర్ డే



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4(వార్త):** పంజా స్ట్రీట్ స్కూల్ లోవరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాధి నివారణ, ముందస్తు పరీక్షల ప్రాముఖ్యత, ఆరోగ్యకర జీవనశైలి గురించి విద్యార్థులకు వివరించారు. ఆహారమే ఔషధం - వంట గదియే ఔషధశాల అని, మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, మద్యం, పొగాకు కు దూరంగా ఉండాలని, ప్రతి రోజూ వ్యాయామం, ధ్యానం, యోగా చేయాలని ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు తెలిపారు. క్యాన్సర్ డే సందర్భంగా సామూహిక ప్రతిజ్ఞ చేశారు. క్యాన్సర్ పై భయం కాకుండా అవగాహన అవసరమని, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ, రాణి, దుర్గమ్మ, శైలజ, సౌజన్య, సుశీల, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## శతశాతం ఇంటి పన్ను వసూలు చేసిన అధికారులను సత్కరించిన కమిషనర్

**మెళియాపుట్టి, ఫిబ్రవరి 4(వార్త):** గ్రామాలలో శతశాతం ఇంటి పన్ను వసూలు, ఐవీఎస్ కాల్స్ లో 100% చేసిన కార్యదర్శులకు రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ ప్రశంసా పత్రాలను ఇచ్చి అభినందించారని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా తెలిపారు. బుధవారం నాడు శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో పంచాయతీరాజ్ కమిషనర్ వారి రివ్యూ మీటింగ్ లో మెళియాపుట్టి మండలంలో 100% ఇంటి పన్నులు వసూలు చేసిన మారేడుకోట కార్యదర్శి కే ఢిల్లేశ్వర్ రావు, సవర కొలిగం కార్యదర్శి కిషోర్, వీరితో పాటు ఐవీఆర్ఎస్ కాల్స్ లో 100% సాధించిన మర్రిపాడు కె కార్యదర్శి మోహన్ రావు, పట్టుపురం కార్యదర్శి లక్ష్మణరావు, గంగరాజపురం కార్యదర్శి జీవన్ లకు కమిషనర్ కృష్ణతేజ ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 14 తేదీ నాటికి గ్రామాలలో పూర్తిస్థాయిలో ఇంటి పన్నులు వసూళ్లను పూర్తిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ తెలిపారు అన్నారు. ఆయనతో పాటు డిపిఓ, సీఈఓ, డి డి ఓ, డిఎల్పిఓ, అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది తదితరులున్నారన్నారు.



## పోలాకిలో నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం



**పోలాకి, ఫిబ్రవరి 4(వార్త):** పోలాకి మండల తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. బుధవారం ఆయన రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులతో కలిసి పోలాకిలో నూతన తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం ఇప్పటికే కోటి 95 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో ఆధునిక సదుపాయాలతో భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలాకి మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, కిల్లి వేణుగోపాలస్వామి, ఉప్పాడ అప్పలరెడ్డి, లుకలాపు చిన్నబాబు, తెంబూరు గౌరినాయుడు, భైరి అచ్చెన్నాయుడు, తహసీల్దార్, డిప్యూటీ ఎంపిడిఓ, రెవెన్యూ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

## ఆధార్ మార్పులకు ప్రత్యేక కేంద్రాలు



**నరసన్నపేట, ఫిబ్రవరి 4(వార్త):** విద్యార్థుల ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు నరసన్నపేటలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీ డీవో ప్రసాదరావు తెలిపారు. ఆరు ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కేంద్రాలు ఈ నెల 6వ తేదీ వరకు పనిచేస్తాయని పేర్కొన్నారు. నారాయణ స్కూల్, సెయింట్ క్లారిటీ స్కూల్, విజ్ఞాన్ విద్యానికేతన్, శ్రీ జ్ఞాన జ్యోతి స్కూల్, రవీంద్ర భారతి, జేవై స్కూల్, ప్రతిభ స్కూల్‌లో ఈ ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అవసరమైన ఆధార్ మార్పులు, చేర్పులు పూర్తిచేసుకోవాలని ఆయన సూచించారు.

## జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో నరసన్నపేట పీఎంశ్రీ పాఠశాల విద్యార్థినుల ఘన విజయం

### -వాలీబాల్లో ప్రథమ స్థానం - పలు క్రీడల్లో ప్రతిభ



**నరసన్నపేట, ఫిబ్రవరి 4(వార్త):** శ్రీకాకుళంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి గ్రిగ్స్ పోటీల్లో నరసన్నపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు అద్భుత ప్రతిభను ప్రదర్శించి సత్తా చాటారని పాఠశాల హెచ్‌ఎం పైడి వెంకటరావు వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో వాలీబాల్‌లో ప్రథమ స్థానం, బ్యాడ్మింటన్‌లో ద్వితీయ స్థానం, జావలిన్ త్రో, డిస్కస్ త్రోల్లో తృతీయ స్థానాలను విద్యార్థినిలు కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఈ విజయాలు పాఠశాల క్రీడా ప్రోత్సాహానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు క్రీడాకారిణులను ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 4 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 15వ వార్డ్ లో 42 మందికి ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేశారు. పట్టణ తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి నందిగామ కోటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ సరస్వతిదేవి అందజేశారు.



# నానో యూరియా వినియోగించాలి



**పోలాకి, ఫిబ్రవరి 4(వార్త):** వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను అవలంబించాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం పోలాకి మండలం మబగాం పంచాయతీలో నానో యూరియా వినియోగం, వ్యవసాయ డ్రోన్ల ఉపయోగంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికంగా యూరియా వినియోగం వల్ల నేల సారాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని, అందువల్ల యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియాను వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం ఒక విప్లవాత్మక మార్పుగా మారిందని, దీని ద్వారా సమయం ఆదా కావడమే కాకుండా పంట దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. గత సీజన్‌లో తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ల వినియోగం ద్వారా పొందిన లాభాలను రైతులకు వివరించారు. ప్రతి పంటలో కనీసం ఒక విడతైనా నానో యూరియా పిచికారీ తప్పనిసరిగా చేయాలని సూచించారు. అలాగే అన్ని పంటల్లో యూరియా వాడకం సిఫారసు చేసిన మోతాదును మించకుండా పాటించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూసార పరీక్షలతోనే అధిక దిగుబడులు



**కొత్తూరు, ఫిబ్రవరి 4(వార్త):** రైతులు తమ పొలాల్లో విచ్చలవిడిగా ఎరువులు వాడకుండా, భూసార పరీక్షల ఆధారంగా సాగు చేస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఐటీడీఏ ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ స్వర్ణలత పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం కొత్తూరు మండలంలోని సిరుసువాడ, కుంటిభద్ర గ్రామాల్లో మట్టి నమూనాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్వర్ణలత మాట్లాడుతూ ఈ భూసార పరీక్షలు ద్వారా భూమిలో బాస్వరం, నత్రజని, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు ఎంత శాతంలో ఉన్నాయో ఖచ్చితంగా తెలుస్తుంది, నేలలో ఉన్న పోషకాలను బట్టి అవసరమైన మేరకే ఎరువులు వేసుకోవడం వల్ల రైతులకు అనవసర ఖర్చు తగ్గుతుందని సూక్ష్మ పోషక లోపాలను గుర్తించి, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు అధికారులు సూచిస్తారు. సూర్య నారాయణ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, శాస్త్రీయ పద్ధతిలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని కోరారు. భూసార పరీక్ష పత్రం రైతులకు ఒక రక్షణ కవచం లాంటిదని, దీనివల్ల భూమి ఆరోగ్యం కాపాడబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.టి.సూర్యనారాయణ, వీఏఏ రాంబాబు, యూనిట్ ఇన్‌ఛార్జ్ చిన్నన్ని, ఐసీఆర్పీ మహాలక్ష్మి మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# సత్యవరంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**నరసన్నపేట, ఫిబ్రవరి 4(వార్త):** సత్యవరం గ్రామంలో మురుగు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు డ్రైనేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లు ఎంపీపీ అరంగి మురళీధర్ తెలిపారు. బుధవారం ఉదయం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు. డ్రైనేజీ నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలు, పంచాయతీ నిధుల నుంచి రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉండటంతో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు ఈ నిధులు కేటాయించినట్లు ఆయన వెల్లడించారు. డ్రైనేజీ పనులు పూర్తయితే పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం


## అమరావతికి నీటి సంఘాల ప్రతినిధుల పయనం

**కొత్తూరు, ఫిబ్రవరి 4(వార్త):** రాష్ట్ర రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో గురువారం జరగనున్న కీలక సమావేశానికి కొత్తూరు మండలానికి చెందిన నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అందరూ కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులో వీరు అమరావతికి పయనమయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు సోదరులు లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు, లోతుగెడ్డ ఇందిర రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వీరు కొబ్బరికాయ కొట్టి, జెండా ఊపి బస్సును అధికారికంగా ప్రారంభించారు. సాగునీటి రంగంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, రైతుల సమస్యలపై ముఖ్యమంత్రితో జరిగే ఈ చర్చా కార్యక్రమం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ జేఈ పైల ప్రసాద్ రావు, వివిధ గ్రామాల సర్పంచులు, నీటి సంఘాల ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అశ్రు నయనాలతో జవాన్ జోగారావు అంత్యక్రియలు

### -అధికార లాంఛనాలతో నిర్వహణ

### -రాధాకృష్ణపురంలో అలముకున్న విషాదచాయలు

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** దేశ సేవకు అంకితమైన ఓ ఆర్మీ జవాను అందని లోకాలకు వెళ్లిపోయాడు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి అంకిత భావం, కృషి, పట్టుదలతో మంచి ర్యాంకు సాధించాడు. అంచెలంచెలుగా ఎదుగుతున్న సమయంలో అందర్నీ వదిలి వెళ్లిపోయాడు. మందస మండలంలోని భైరిసారంగపురం పంచాయతీ రాధాకృష్ణపురం గ్రామానికి చెందిన లోళ్ల జోగారావు(36) ఆర్మీలో పని చేస్తూ మరణించడంతో ఆ గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. జోగారావు(జగదీశ్, జీవన్) సుమారు 14 ఏళ్ల క్రితం ఆర్మీలో జవానుగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి దేశ రక్షణలో తనదైన సేవలందిస్తున్నారు. ప్రస్తుతం లేహ్ ప్రాంతంలో పని చేస్తున్న ఆయన సెలవుపై వచ్చారు. మందస రైల్వే స్టేషన్‌కు వెళ్లిన ఆయన ప్రమాదవశాత్తూ రైలు ఢీకొని మరణించారు. విషయం తెలుసుకున్న పలాస జీఆర్పీ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శవ పంచనామా, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని ఆయన స్వగ్రామం రాధాకృష్ణపురం తరలించారు. 36 ఏళ్ల వయస్సులోనే ఆర్మీలో పని చేస్తూ.. మరణించిన జోగారావు మృతదేహాన్ని చూడగానే గ్రామమంతా ఘొల్లుమంది. జోగారావు, తల్లిదండ్రులు తిరుపతిమ్మ, ఢిల్లేశ్వరరావు, భార్య మృదుల రోదనను ఆపడం ఎవరి తరమూ కాలేదు. మృతుని రక్త సంబంధీకులు,





బంధువులు కూడా కన్నీరుమున్నీరుగా విలపించారు. జోగారావుకు నాలుగేళ్ల కుమార్తె ఉంది. గ్రామం చిన్నదైనప్పటికీ, ఊరంతా విషాద వదనాలతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కాగా, విషయం తెలుసుకున్న ఆర్మీ సైనికులు జోగారావు మృతదేహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. వారు కూడా కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామం చిన్నదైనప్పటికీ, ఊరంతా విషాద వదనాలతో అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్మీ సైనికులు జోగారావు మృతదేహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. వారు కూడా అంత్యక్రియల్లో పాల్గొని, అమరహే జోగారావు.. భారత్ మాతాకు జై అంటూ నినాదాలు చేశారు. ఈలోగా ఎచ్చెర్ల నుంచి రిజర్వ్ పోలీసు దళం చేరుకుని, జోగారావు చితికి నిప్పు అంటించగానే గౌరవ వంద నం చేసి.. సంతాప సూచికంగా మూడు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. విశాఖపట్టణం నుంచి ఆర్మీ అధికారులు వచ్చి, జోగారావు కుటుంబాన్ని ఓదా ర్చారు. ఆర్మీ నుంచి జాతీయ పతాకం అందజేశారు. అతి చిన్న వయస్సులోనే జోగారావును కోల్పోతామని ఊహించలేదని ఇటు కుటుంబీకులు, అటు ఆర్మీ సైనికులు కన్నీటి పర్యవంతమయ్యారు. ఎంతో నిబద్ధతగా పని చేసే ఆయన ఇకలేరు అన్న నిజాన్ని నమ్మలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

## కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుర్చీల వితరణ



**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సూర్యతేజ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ / కరెస్పాండెంట్ దానేటి పద్మజి, కామేశ్వరరావులు సుమారు 20 వేలు విలువ చేసే 30 కుర్చీలను సిబ్బంది కోసం, విద్యార్థుల అవసరాల నిమిత్తం బుధవారం అందజేశారు. గతంలో కూడా పాఠశాల అభివృద్ధి కొరకు 20,000/- నగదును అందజేశారు. సందర్భంగా సూర్య తేజ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం కొంత మేరకు సహాయం చేయాలని ఉద్దేశంతో కుర్చీలను బహుకరించామని తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. విద్యను అభ్యాసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని, ఒక ఐఏఎస్, ఐపిఎస్ సాధించాలంటే పట్టుదలతో చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నం నాయుడు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## భూ కబ్జాలపై కలెక్టర్‌ని హైజాక్ చేశారు

### - ధ్వజమెత్తిన వైసిపి నేతలు



**పలాస, ఫిబ్రవరి 4(వార్త):** పలాస- కాశీబుగ్గలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరుగుతున్న భూకబ్జాలపై సాక్షాదారులతో తమ పార్టీ నిరూపిస్తే తర్యాప్తుకై వచ్చిన జిల్లా కలెక్టర్ పర్యటనను సైతం టిడిపి నేతలు హైజాక్ చేశారని పలాస కాశీబుగ్గ మున్సిపల్ వైసీపీ పార్టీ అధ్యక్షుడు శిస్టు గోపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు విమర్శించారు. బుధవారం సాయంత్రం ప్రగతి భవన్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి దేశము నేతల చర్యలను తీవ్రంగా ఖండించారు. కూటమి నేతలు ప్రజాబలంతో గెలవలేదని కనుక్కొని ప్రజా సంక్షేమము వారికి పట్టడం లేదని ఆరోపించారు. పలాస కాశీబుగ్గలను కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాలను రెవెన్యూ గ్రామాలను సైతం మార్చేసి తప్పుడు సర్వే నంబర్లతో దోచుకుంటున్నారని, దీనిపై మళ్లీ కలెక్టర్ దర్యాప్తు కోరతామని అన్నారు. అధికార పార్టీలో ఉండి భూఆక్రమణలపై సవాళ్లు విసరడము కాదని, సవాళ్లు నిజాయితీనితో నిరూపించుకోవాలని, ప్రతి సవాళ్లు విసిరారు. అదేవిధంగా టిటిడి లడ్డు కల్తీ జరిగిందని దుష్ప్రచారం చేస్తున్న చంద్రబాబుని వెంకటేశ్వర స్వామి కూడా క్షమించడని, కేంద్ర ప్రభుత్వ హయాములో ఉన్న సిబిఐ సీట్లో ఎన్డిడిబి, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రిపోర్ట్ లో కల్తీ జరగలేదని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, సీఎం చంద్రబాబు నాయుడు డైవర్షన్ పాలిటిక్స్ నడిపిస్తున్నారని, రాష్ట్రములో రెడ్బుక్ రాజ్యాంగంగా అమలు చేస్తున్నారని నారా లోకేష్ ని సీఎంగా చేయడమే చంద్రబాబు లక్ష్యమని, సుప్రీంకోర్టు ఆదేశాలు సైతం బేకాతర చేస్తున్న అంశము రాష్ట్రానికి తీవ్ర విఘాతము కలిగిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు దువ్వాడ రవి, మాజీ ఎంపీపీ బత్తిని హేమేశ్వరరావు, మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** శ్రీకాకుళంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నందు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. డిప్యూటీ డీఎం హెచ్ ఓ మేరీ కేథరిన్, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.శివరంజని ఆధ్వర్యంలో జెండా ఊపి లాంఛనంగా ర్యాలీ ప్రారంభించారు. క్యాన్సర్ పై విజయం-స్క్రీనింగ్ తోనే సాధ్యం అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీని ఏడు రోడ్ల కూడలి వరకు సాగింది. ఈ సందర్భంగా డా.మేరీ కేథరిన్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రపంచం లో మొదటిది గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధి అనేది రెండవ స్థానం లో ఉందని దానిని నివారించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వచ్చి క్యాన్సర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. క్యాన్సర్ బాధితుల్లో ప్రతి ముగ్గురిలో ఇద్దరికీ వ్యాధి ముదిరిన తరువాతే ఇది నిర్ధారణ అవుతోందని, అందువల్ల బతికే అవకాశాలు తగ్గిపోతున్నాయని, దీనిపై సరైన అవగాహన లేక క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అవగాహన లేకపోవడం , నిరక్షరాస్యత, భయం వివిధ రకాల అపోహల వల్ల క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యం అవుతోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్‌లు, ఎన్‌సిడి సిబ్బంది, డిప్యూటీ డెమో ఎర్రన్న, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్స్ మోహిని, విజయలక్ష్మి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎం లు, ఆశా లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో క్విజ్ కాంపిటీషన్ నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటో అందచేశారు. ఈ కార్యక్రమంలో డా.మనోజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పోలినాయుడు, వైస్ ప్రిన్సిపల్ హరిత, రాజశేఖర్, ఎన్‌సిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.శివ రంజని పాల్గొన్నారు.

## పరిశ్రమల భద్రతపై రాజీ వద్దు

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4(వార్త):** జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు రాజీవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జిల్లా సంక్షోభ నివారణ బృందం' సమావేశంలో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ సిఫార్సులను యుద్ధప్రతిపాదికన అమలు చేయాలన్నారు. పైడిభీమవరంలోని శ్రేయాస్ ఇండస్ట్రీస్‌లో ఉన్న మిథనాల్ నిల్వ సామర్థ్యాన్ని కమిటీ పరిశీలించాలన్నారు. పరిశ్రమల్లో విష వాయువుల లీకేజీని గుర్తించేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిరంతరం నిఘా ఉంచాలని, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు వీలుగా ఆన్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలకు, కార్మికులకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లకు జిల్లా అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విశాఖపట్నం ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాంబాబు, డీఐసీ జనరల్ మేనేజర్ రఘునాథ్ పాల్గొన్నారు.



## పొందూరు ఖద్దరుకు మహర్దశ

- ✱ రూ.100 కోట్లతో క్లస్టర్ యూనిట్
- ✱ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కూన రవికుమార్
- ✱ వేలాది మందికి ఉపాధి లక్ష్యంగా భారీ ప్రాజెక్టు

**పొందూరు, ఫిబ్రవరి 4 (వార్త):** పొందూరు ఖద్దరుకు ఉన్న చారిత్రక విశిష్టతను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆమదాలవలస శాసనసభ్యులు, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ స్పష్టం చేశారు. సుమారు రూ. 100 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు కానున్న ఈ క్లస్టర్ యూనిట్ ద్వారా ఆ ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఖాదీ, ఖద్దర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు కోసం కేటాయించిన స్థలాన్ని ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నియోజకవర్గ పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పొందూరు ఖద్దరుకు గ్లోబల్ గుర్తింపు తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి, 'జీఐ' ట్యాగ్ సాధించడంలో కీలక పాత్ర పోషించామని గుర్తుచేశారు. ఇప్పుడు రూ. 100 కోట్లతో ఏర్పాటు చేయనున్న క్లస్టర్ ద్వారా ఆధునిక సాంకేతికతను జోడించి ఖాదీ ఉత్పత్తుల తయారీ, శిక్షణ, మార్కెటింగ్‌లను ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నట్లు వివరించారు. ఈ యూనిట్ అందుబాటులోకి వస్తే వేలాది మంది స్థానిక మహిళలకు, కార్మికులకు, యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. స్థల విస్తీర్ణం, మౌలిక సదుపాయాలు, విద్యుత్, నీటి వసతులు, రహదారి అనుసంధానంపై అధికారులతో సమీక్షించిన ఆయన, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతలో భాగంగానే ఈ క్లస్టర్ మంజూరైందని, ఇది స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త గుర్తింపునిస్తుందని స్పష్టం చేశారు. క్లస్టర్ యూనిట్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం ఉన్నతాధికారులు, కూటమికి చెందిన స్థానిక నాయకులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మార్చి 15లోగా ఉపాధి బిల్లులు అప్‌లోడ్ చేయాలి

- ✱ జిల్లాలో 13,839 పాత పనులను వెంటనే పూర్తి చేయండి
- ✱ అధికారుల సమీక్షలో పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 4 (వార్త):** జిల్లాలో ప్రగతిలో ఉన్న ఉపాధి హామీ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, గడువులోగా నిధుల వినియోగం చేపట్టాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. బుధవారం శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి ఆయన ఉపాధి హామీ పనులు, మెటీరియల్ నిధుల వ్యయంపై విస్తృతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జిల్లాలోని 912 పంచాయతీల్లో 2017 నుంచి ఇప్పటివరకు సుమారు 13,839 పనులు వివిధ దశల్లో ప్రగతిలో ఉన్నాయని, వాటిని తక్షణమే పూర్తి చేసి సంబంధిత వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలన్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో గ్రామ పంచాయతీలో గరిష్టంగా 20 పనులు మాత్రమే అందుబాటులో ఉండాలని, ఆ లెక్కన జిల్లా వ్యాప్తంగా వివిధ దశలలో ఉన్న 18,240 పనుల మినహా మిగిలిన అన్నింటినీ పూర్తి చేయాల్సిందేనని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని ఆయన హెచ్చరించారు. మెటీరియల్ కంపోనెంట్ నిధుల గురించి వివరిస్తూ.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 60:40 నిష్పత్తిలో సుమారు రూ. 214 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని కమిషనర్ తెలిపారు. మార్చి 15వ తేదీ నాటికి వీటికి సంబంధించిన బిల్లుల ప్రక్రియను పూర్తి చేసి, పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ లవరాజు స్పందిస్తూ.. ఇప్పటికే రూ. 111.72 కోట్ల విలువైన బిల్లులను నిక్ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేసినట్లు కమిషనర్‌కు వివరించారు. ఈ సమీక్షలో మండలాల వారీగా ఉన్న ప్రగతిని పట్టికల ద్వారా పరిశీలించి, వెనుకబడిన మండలాల అధికారులపై కమిషనర్ లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి. లవరాజు, ఆర్ అండ్ ఎస్ ఈ సత్యనారాయణ, జడ్పీ సీఈవో సత్యనారాయణ, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.



## తాడివలసలో బీటీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఆమదాలవలస, ఫిబ్రవరి 4(వార్త):** ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు శర వేగంగా కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే కూన రవికుమార్ పొందూరు మండలం తాడివలస ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి పీహెచ్‌సీ వరకు, లచ్చయ్య పేట నుండి కావలి గ్రామం వరకు పలు బీటీ రోడ్లును, తాడివలసలో నిర్మించిన పలు సిసి రోడ్లు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా రహదారులు గ్రామాల ప్రగతికి ప్రాణాధారమని, నాణ్యమైన రోడ్ల నిర్మాణం వల్ల ప్రజల జీవన విధానం మెరుగుపడటంతో పాటు వ్యవసాయ, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఊతం లభిస్తుందన్నారు. తాడివలస పంచాయతీ పరిధిలో ప్రజలు చాలా కాలంగా ఎదురుచూస్తున్న రోడ్ల సమస్యను పరిష్కరించగలిగినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. ఈ బీటీ రోడ్ల ప్రారంభంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం అవుతాయని, విద్యార్థులు, రైతులు, కార్మికులు, వృద్ధులు అందరికీ ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అక్షరాలా అమలు చేస్తూ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో కూడా ఆముదాలవలస నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి పంచాయతీలో అవసరమైన ప్రతీ రోడ్డు వేస్తామని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని, ముఖ్యంగా రోడ్లు, త్రాగునీరు, విద్యుత్, విద్య, వైద్య రంగాల్లో సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ, ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.



## బ్రహ్మోత్సవాల్లో పాల్గొని.. స్వామి ఆశీస్సులు పొందాలి

### -ప్రముఖులకు ఆహ్వానం పలికిన వాసుదేవ ఆలయ అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు

**మందస, ఫిబ్రవరి 4(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా జరపడానికి నిశ్చయించాం.. ఈ నెల 7నుంచి 13వ తేదీ వరకు వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగునున్నాయి.. మీరు తప్పక బ్రహ్మోత్సవాలకు రావాలని, స్వామి ఆశీస్సులు పొందాలని వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులతో పాటు అర్చకులు, శ్రీవాసుదేవ సేవాసమితి, శ్రీవాసుదేవ ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు ప్రముఖులను కలిసి, ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. పలాస నియోజకవర్గం ఎంఎల్ఏ గౌతు శిరీషా, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ లకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేసి, పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఏడాదికొకసారి జరిగే స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ఈ మేరకు వారంతా సానుకూలంగా స్పందించినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులతో దేవరశెట్టి మార్కండేయులు, రాజాన మహేశ్, డుంకురు తిరుపతిరావు, కరతల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.





Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546